గ్యాస్ జరభద్రం



చిత్తూరు రూరల్: ప్రతి వస్తువుకూ వినియోగించే గడువు ఉన్నట్టే నిత్యమూ మనం వినియోగించే వంట గ్యాస్ సిలిండర్‌కు ఉంటుంది. ఈ విషయం చాలా మందికి తెలియదు. కాలం చెల్లిన తర్వాత వినియోగించడం ప్రమాదకరం. వంట గ్యాస్ వచ్చిన మొదట్లో ఇంటింటికీ కనెక్షన్లు తీసుకోవాలని డీలర్లు బతిమలాడితే వద్దని చెప్పేవారట. ఎందుకంటే వంట గ్యాస్ ప్రమాదకరమని, సిలిండర్ పేలిపోతుందని నమ్మేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రతి ఇంటికీ గ్యాస్ కనెక్షన్ ఉంది. మారుమూల గ్రామాల్లో సైతం గ్యాస్‌ను వినియోగిస్తున్నారు. సిలిండర్ వినియోగించే గడువు గురించి అధికారులు అవగాహన కల్పించడం లేదు.

దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. చిత్తూరు నగరం, మండల ప్రాంతాల్లో 50 వేల కుటుంబాలు ఉండగా 12 గ్యాస్ ఏజెన్సీల కింద 85 వేల వంట, కమర్షియల్ గ్యాస్ కనెక్షన్‌లున్నాయి. రోజుకు 20 వేల నుంచి 30 వేల వరకు గ్యాస్ సిలిండర్లు అమ్ముడుపోతున్నాయి. ఇందులో ప్రధానంగా గ్యాస్ లీకేజీ సమస్య ఏర్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి.

కాలపరిమితి ముఖ్యం

ఖాళీ సిలిండర్లకు కూడా నిర్దిష్ట కాల పరిమితి ఉంది. ఇది వినియోగదారులకు సంబంధం లేదు. ఖాళీ సిలిండర్ కాల పరిమితి ఏడేళ్లు. తయారీదారులు తమ వద్ద ఉన్న సమాచారం ప్రకారం ఏడేళ్లు దాటిన సిలిండర్లను డీలర్ల నుంచి వెనక్కి తెప్పించుకుని పరీక్షిస్తారు. ఏమాత్రం వినియోగ యోగ్యం కాని, నాణ్యత లేని సిలిండర్లను పక్కన పెట్టేస్తారు.



తేదిలను గుర్తించడం ఇలా...

సిలిండర్ రింగ్‌కు కింది భాగంలో మూడు ఇనుప కమ్మీలుంటాయి. వాటిలో ఒక లోపలి వైపున గడువు తేదీ ముద్రించి ఉంటుంది. పన్నెండు నెలలను నాలుగు భాగాలుగా చేసి ఒక ఇంగ్లిష్ అక్షరం కేటాయిస్తారు. అంటే జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు ఏ అక్షరం, మే, జూన్ నెలలకు బీ అక్షరం, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సీ అక్షరం, అక్టోబర్, డిసెంబర్ నెలలకు డీ అక్షరం కేటాయిస్తారు. ఆ నెల దాటితే దాన్ని వినియోగానికి దూరం పెట్టాలి.

కాలం చెల్లితే

కాలం చెల్లిన సిలిండర్ల వినియోగం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. చాలా మంది గ్యాస్ సిలిండర్ నెలల తరబడి వాడకుండా నిల్వ ఉంచుతారు. అటువంటి వాటిని తప్పనిసరిగా ఎక్స్పైరీ డేట్ చూసుకుని వినియోగించాలి. లేని పక్షంలో డీలర్లకు తిరిగి ఇచ్చేయాలి. మరికొందరు బ్లాక్‌లో కొని మరీ వాడుతుంటారు. ఇలాంటి వారు సిలిండర్‌పై నమోదు చేసిన గడువు తేదీలోపు వాడితే ఉత్తమం. అలాగే సిలిండర్ లీకవుతున్నట్లు అనుమానం ఉంటే వెంటనే ఏజెన్సీకి సమాచారం ఇవ్వాలి.

ఇవి పాటించాలి

- వంట చేసేందుకు సిద్ధమయ్యే ముందు గ్యాస్ స్టవ్ సిలిండర్ జాగ్రత్తగా గమనించాలి.
- లీకవుతుంటే వెంటనే అప్రమత్తం కావాలి.
- గ్యాస్ కంపెనీ అత్యవసర ఫోన్ నెం (టోల్ ఫ్రీ నెంబరు 1906)కు సమాచారం అందించాలి.
- గ్యాస్ లీక్ అయిన సందర్భంలో సేఫ్టీపిన్ అమర్చి సిలిండర్‌ను ఖాళీ ప్రదేశంలో ఉంచాలి.
- వంట గది తలుపు కింద కనీసం అర అంగుళం గ్యాస్ ఖాళీగా ఉండేలా చూడాలి.
- గ్యాస్ స్టవ్, పూజగది, రిఫ్రిజిరేటర్ ఒకేచోట ఉంచరాదు.
- స్టవ్ ఉపయోగించని సమయంలో రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలి.
- వంట గదిలో గాలి, వెలుతురు ఉండేలా చూడాలి.
- గ్యాస్ సిలిండర్ దగ్గర మంట త్వరగా అంటుకునే స్వభావం కలిగిన వస్తువులు ఉంచకూడదు.
- గ్యాస్ స్టవ్ పైపులు ఆరు నెలలకోసారి తప్పక మార్చాలి.
- సక్రమంగా సమాచారం అందించని సిబ్బంది వివరాలను స్థానిక పౌరసరఫరాల శాఖ అధికారులకు తెలియజేయాలి.

క్లుప్తంగా

లడ్డూ పోటు, పడితరం స్టోర్ నిర్మాణ పనుల పరిశీలన



లడ్డూపోటు భవనాన్ని పరిశీలిస్తున్న ఆలయ ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి సంబంధించి నూతన లడ్డూ పోటు, పడితరం స్టోర్ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఈఓ వెంకటేశు ఆదేశించారు. ఆయన సోమవారం నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పక్కాగా నిర్వహించాలి



పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓలు

గుడిపాల: రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఎంఈఓలు రామ్‌నాయక్, గణపతి తెలిపారు. పానాటూరు ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. అలాగే సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల బోధనా పనితీరు, పాఠ్య ప్రణాళిక, టీచింగ్ నోట్స్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, నాడు-నేడు రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, సీఆర్పీ మల్లికార్జున్ పాల్గొన్నారు.

హెన్రీ డ్యూనెంట్ వర్ధంతి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో సోమవారం సొసైటీ వ్యవస్థాపకులు హెన్రీ డ్యూనెంట్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సభ్యులు సహదేవనాయుడు, విజయ్‌కుమార్, గోపి, చిరంజీవి, రాజన్న, పార్వతి, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన ఎస్‌బీఐ ఏటీఎం



మూతపడి ఏటీఎం కేంద్రం

గుడిపాల: మండల కేంద్రమైన గుడిపాలలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రం నెలరోజులుగా మూతపడడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్టోబర్ 2వ తేదీన గుర్తుతెలియని దుండగులు ఏటీఎం కేంద్రంలోని మెషిన్లను ధ్వంసం చేసి నగదు చోరీ చేసేందుకు ప్రయత్నించారు. నాటి నుంచి ఇప్పటి దాకా ఏటీఎం కేంద్రాన్ని మూసివేశారు. పలువురు స్థానికంగా ఉన్న స్టేట్ బ్యాంక్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. నగదు విత్‌డ్రా కోసం బ్యాంకు ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏటీఎం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

3న భారీ జాబ్‌మేళా

పలమనేరు: పట్టణంలోని గుండుబావి ఎదురుగా ఉన్న శ్రీపద్మావతి, వాణి డిగ్రీ కళాశాలల్లో నవంబర్ 3న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భారీ జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చైతన్యకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన వారు ఈ మేళాకు హాజరు కావచ్చని, 20 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తారని తెలిపారు. ఉద్యోగాలను బట్టి నెలకు వేతనం రూ.12వేల నుంచి రూ.30వేల వరకు ఉంటుందని, జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి సమాచారం కోసం 8121984014, 9505601887 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఏటీఎల్ ల్యాబ్ ప్రదర్శనలు పెరగాలి

నగరి : విద్యార్థులు అతల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్)కు సంబంధించిన ప్రదర్శనలను భవిష్యత్తులో ఎక్కువగా నిర్వహించాలని స్టేట్ టాస్క్‌ఫోర్స్ సభ్యులు మహమ్మద్ జాకీర్ హుస్సేన్, మోహన్ సింగ్ అన్నారు. సోమవారం నగరి పట్టణంలోని ఎస్‌జీఎస్ జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని ల్యాబ్‌లను వారు ఆకస్మిక తనిఖీ చేశారు. ల్యాబ్‌లలోని పరికరాలు వాటికి సంబంధించిన రిజిష్టర్లను పరిశీలించారు. ల్యాబ్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన వారు, అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ల్యాబ్ వినియోగం ఇంకా మెరుగుపరుచుకోవడానికి తగు సూచనలు ఇచ్చారు. భవిష్యత్ కార్యక్రమాల్లో ఏటీఎల్ ల్యాబ్‌కు సంబంధించిన ప్రదర్శనలు మెండుగా ఉండాలని సూచించారు. జిల్లాస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆశించారు. పాఠశాలలో హెచ్‌ఎం పార్వతీ దేవి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

కాణిపాకంలో నిరంతర భజనలు ప్రారంభించాలి



ర్యాలీ చేస్తున్న కళాకారులు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిరంతర భజనలు ప్రారంభించాలని జిల్లా జానపద కళాకారుల సంఘం నాయకులు విన్నవించారు. కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అనుబంధ వరదరాజుల స్వామి ఆలయంలో సోమవారం జానపద కళాకారుల సంఘం నాయకులు, కళాకారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద నవంబర్ 18, 19వ తేదీల్లో నిరంతర భజన కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతులు విజయశంకర్ స్వామి, కళాకారుల జిల్లా అధ్యక్షుడు రామచంద్ర గురుస్వామి, గౌరవ అధ్యక్షుడు సురేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



ఈఓ వెంకటేశుకు వినతి పత్రం అందజేస్తున్న కళాకారులు

వచ్చేనెల 16, 17 తేదీల్లో స్టాంపుల ప్రదర్శన



పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: తపాలాశాఖ ఆధ్వర్యంలో నవంబరు 16, 17న చిత్తూరులోని టీటీడీ కల్యాణ మండపంలో జిల్లా స్థాయి స్టాంపుల సేకరణ, ప్రదర్శన ఉంటుందని తపాలా డివిజన్ సూపరింటిండెంట్ లక్ష్మన్న తెలిపారు. జిల్లా ప్రధాన తపాలా కార్యాలయం ఆవరణలో సోమవారం ప్రదర్శన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఆ రోజు పలు రకాల స్టాంపుల ప్రదర్శన ఉంటుందన్నారు. అదే విధంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, స్టాంపుల డిజైన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు గణపతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు వరం.. జగనన్న పాల వెల్లువ



ఈచనేరి గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో అబ్దుల్‌కలాంఆజాద్

తవణంపల్లె: ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపడుతున్న జగనన్న పాల వెల్లువ కార్యక్రమం పాడి రైతులకు వరమని ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్ తెలిపారు. మండలంలోని వెంగంపల్లె, ఈచనేరి గ్రామాల్లో సోమవారం జగనన్న పాల వెల్లువపై గ్రామ సభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతులు 11 మంది సంఘంగా ఏర్పడాలని సూచించారు. తద్వారా రైతులే పాల ధర నిర్ణయించే అవకాశం ఉంటుందన్నారు. మండలంలోని అన్ని సచివాలయాల్లోనూ గ్రామ సభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఈచనేరి సర్పంచ్ ఉమామహేశ్వర రెడ్డి, ఏపీవో లలిత పాల్గొన్నారు.

నేడు దిగువ మోదలపల్లెలో జగనన్న పాల వెల్లువ

మండలంలోని దిగువమోదలపల్లె, చిగరాకుల పల్లెలో మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు జగనన్న పాల వెల్లువ కార్యక్రమంపై గ్రామ సభ నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతి తెలిపారు. గ్రామ సభకు తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి పాల్గొంటారని వివరించారు.

పాఠశాలలకు వంటపాత్రలు



ఎమ్మార్సీలో ఉన్న వంటపాత్రలు

గుడిపాల: మధ్యాహ్న భోజనం వండడానికి గాను మండలంలోని 62 పాఠశాలలకు ప్రభుత్వం సోమవారం వంటపాత్రలు పంపించిందని ఎంఈవో రామ్‌నాయక్ తెలిపారు. మండలంలో 1 నుంచి 10వ తరగతి వరకు 2,580 మంది విద్యార్థులు చదువుతున్నారని పేర్కొన్నారు. వారికి మధ్యాహ్న భోజనం వండడానికి ప్రభుత్వం జగనన్న గోరుముద్దలో భాగంగా వంట పాత్రలు మంజూరు చేసింది. తడి, పొడి చెత్తను వేయడానికి ప్లాస్టిక్ టబ్బులు, బాత్‌రూంలకు సంబంధించి బకెట్, జగ్గులు అందజేసింది. వాటిని ఆయా పాఠశాలలకు చేరవేస్తామని ఎంఈవో రామ్‌నాయక్ తెలిపారు.

స్పందనలో రెవెన్యూ సమస్యలు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ మురళీ మోహన్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. దారి, ఇళ్ల పట్టాలు, భూ తగాదాలు, సర్వేసమ్యలు, రేషన్‌కార్డు, శ్మశాన సమస్యలపై 22 అర్జీలు వచ్చాయని, వాటిని పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని వీఆర్వోలను ఆదేశించారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలపండి



మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ మధుసూదన్‌రెడ్డి

గుడిపాల: ఒటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని మండల స్పెషలాఫీసర్ మధుసూన్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే ఫారం-6 ద్వారా డిసెంబర్ 9వ తేదీ వరకు తెలపవచ్చన్నారు. గ్రామంలో మరణించిన వారి, గ్రామం నుంచి వలస వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగిస్తామన్నారు. నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ వెల్లడించారు. కొత్తగా ఓటరుగా చేరాలనుకొనే వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



బంగారుపాళెం: తగ్గువారిపల్లెలో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

బంగారుపాళెం: పేదలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి తెలిపారు. మండలంలోని తగ్గువారిపల్లె గ్రామ సచివాలయంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. అలాగే వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద వృద్ధులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి సర్పంచ్ వాణిప్రియ, ఎంపీటీసీ హేమచంద్ర, షబీనా, ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్, మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్ పాల్గొన్నారు.

సామాజిక బాధ్యత కలిగి ఉండాలి



మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న కృష్ణారావు, హెచ్‌ఎం

ఐరాల: ప్రతి ఒక్క విద్యార్థీ చిన్నతనం నుంచి చదువుతో పాటు సామాజిక బాధ్యత, సేవా దృక్పథం కలిగి ఉండాలని కేఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ హెడ్ కే.కృష్ణారావు తెలిపారు. కాణిపాకం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని బాలికల కోసం రూ.6 లక్షలతో నిర్మించిన రెండు మరుగుదొడ్లను సోమవారం కేఎస్‌ఆర్ తిరుమల ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, క్యూబీ హైవేస్ ప్రతినిధులు హెచ్‌ఎం చంద్రశేఖర్‌నాయుడితో కలిసి ప్రారంభించారు. కృష్ణారావు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడంతోపాటు వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను కలిగి ఉండి ఇతరులకు ఆదర్శనీయంగా ఉండాలన్నారు. అనంతరం సంస్థ ప్రతినిధులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కేఎస్‌ఆర్ మేనేజర్ నాగరాజ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మేఘన, ఉపాధ్యాయులు సోమశేఖర్‌నాయుడు, సురేంద్రబాబు, సురేష్‌బాబు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి



వీఆర్వోలతో మాట్లాడుతున్న అనీల్‌కుమార్

బంగారుపాళెం: స్పదనలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ అనీల్‌కుమార్ సూచించారు. ఆయన సోమవారం వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లతో సమావేశమయ్యారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల్లో ఎక్కువగా రెవెన్యూ పరమైన సమస్యలే ఉన్నాయని తెలిపారు. వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. పెద్ద సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఆర్ఐ దీపక్‌రెడ్డి, సర్వేయర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



మల్లప్పకొండపై నిర్వహిస్తున్న గిరిజా కల్యాణోత్సవం

గుడుపల్లె: మల్లప్పకొండపై ఉన్న మల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గిరిజా కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ కుంభాభిషేకం అనంతరం 48 రోజులు అఖండ జ్యోతులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కలశ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు, స్వామి వారికి రుద్రాభిషేకం, హోమాలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి, భక్త జన సందడి నడుమ వేద పండితులు కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

3న రాష్ట్ర విద్యా సాఫల్య సర్వే



రాష్ట్ర విద్యా సాఫల్య సర్వేపై ఇన్విజిలేటర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓలు

పలమనేరు: దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల బడుల్లోని విద్యావ్యవస్థ స్వరూపాన్ని, అభ్యసనా ఫలితాలను అంచనా వేసేందుకు దేశవాప్తంగా నవంబరు 3న నిర్వహించే స్టేట్ ఎచీవ్‌మెంట్ సర్వేను పలమనేరు మండలంలో పటిష్టంగా నిర్వహించాలని ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం ఆదేశించారు. దీనికి సంబంధించి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడారు. స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 3,6,9 తరగతుల విద్యార్థులకు ఓఎంఆర్ షీట్ల ద్వారా పరీక్ష ఉంటుందన్నారు. దీనికి ప్రశ్నపత్రాన్ని ఎస్సీఈఆర్టీ రూపొందిస్తుందన్నారు. ఇప్పటికే బడుల్లో మాదిరి ప్రశ్నపత్రాలతో విద్యార్థులకు మోడల్ పరీక్షలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ పరీక్షలకు ఫీల్డ్ ఇన్విజిలేటర్లుగా స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు వ్యవహరించనున్నట్టు పేర్కొన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశులు పాల్గొన్నారు.

ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌కు శిక్షణ



అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

పాలసముద్రం : విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలపై అంచనా కోసం ఎంపిక చేసిన పరీక్ష ఎలా నిర్వహించాలనే దానిపై ఇన్వెస్టిగేటర్లకు సోమవారం ఎమ్మార్సీలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ స్టేట్ లెవల్ అచీవ్‌మెంట్ సర్వే కోసం మండలాన్ని ఎంపిక చేశారన్నారు. ఇందులో 3, 6, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులను సర్వే చేశామని తెలిపారు. వచ్చే నెల 3న నిర్వహించే ఈ సర్వే ద్వారా దేశంలోని ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న విద్యా వ్యవస్థలోని బలాలు, బలహీనతలు అంచనా వేయవచ్చన్నారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్ పరీక్షకు సంబంధించి ఇంజినీరింగ్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు విధి విధానాలపై అవగాహన కల్పించారు. 60 నిమిషాల్లో 40 ప్రశ్నలకు, 9వ తరగతి విద్యార్థులు 90 నిమిషాల్లో 60 ప్రశ్నలకు జవాబులు ఓఎంఆర్ షీట్స్‌లో రాయాల్సి ఉంటుందన్నారు. దివ్యాంగులు ఈ పరీక్షకు హాజరైతే, వారికి అదనంగా 30 నిమిషాలు కేటాయింపు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 గిరిజ, సీఆర్పీలు శరవణన్, మునిరాజ్, రాజేశ్వరి, మహాలక్ష్మి, ఇన్వెస్టిగేటర్లు పాల్గొన్నారు.

కొండమల్లీశ్వరుడికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామివారికి సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారిని వేకువజామునే సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశ్వరుడికి పాలు, పెరుగు, నారికేళి, విబూదితో అభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామి వారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

2న వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన

పెద్దపంజాణి: మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ నడింపల్లెలో నవంబర్ 2న గురువారం వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్టు వాల్మీకి సంఘ నాయకులు సోమవారం తెలిపారు. తొలుత వాల్మీకి చిత్రపటాన్ని నడింపల్లె, రాగిమాకులపల్లె, గౌదమాకులపల్లె, టీకే పల్లె, లింగమనాయునిపల్లె, సూరకుంట్ల, రాయలపేట, మారప్పల్లె, నడింపల్లె గ్రామాల లో ఊరేగించనున్నట్లు తెలియజేశారు. అనంతరం అన్నదానం చేయనున్నట్టు పేర్కొన్నారు.